# రాజ్యాంగ సమీక్ష అవసరమే కాని...
# ఎవరికోసం ? ఎందుకోసం ?

రాజ్యాంగాన్ని సమీక్షిద్దామని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ప్రతిపాదించడం దేశంలో పెద్ద దుమారం లేవదీసింది.

రాజ్యాంగాన్ని తమదిగా భావించేవారు ఇద్దరు కనిపిస్తున్నారు మన దేశంలో. ఒకరు నెహ్రూ సంప్రదాయానికి చెందిన కాంగ్రెస్ వాదులు, మేధావులు. వీరిలో ఒకరైన రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ఒక సూటి ప్రశ్నవేశారు.

సమీక్షించవలసింది రాజ్యాంగాన్నా ? లేక రాజ్యాంగం అమలునా ? అన్నది ఆయన ప్రశ్న.

రెండవ వర్గం అంబేద్కర్ అనుయాయులైన దళితవాదులు. వీరు ఇంకొకసూటి ప్రశ్న వేశారు.

రాజ్యాంగాన్ని సమీక్షించాలనడంలో బిజెపి ఉద్దేశ్యం ఏమిటి ? మనుధర్మానికి అనుకూలమైన రాజ్యాంగాన్ని రాసుకోవడమా ? అన్నది వారి ప్రశ్న.

రాష్ట్రపతి ప్రశ్నను రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగం చాలా బాగుంది గానీ దాని అమలులోనే లోపాలున్నాయని అర్థం చేసుకోవచ్చు. లేదా, రాజ్యాంగం అంటే కేవలం ఒక పుస్తకం కాదనీ రాజ్యాంగ సూత్రాలు దేశపాలనలో తీసుకున్న నిర్దిష్ట రూపమే 'రాజ్యాంగ'మనీ అర్థం చేసుకోవచ్చు. అప్పుడు చర్చించవలసింది రాజ్యాంగంలోని ఈ అధికరణాన్నో ఆ అధికరణాన్నో కాదు. దేశపాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ, దేశ రాజకీయాలు కలిసి ప్రజలకందించిన 'రాజ్యాంగాన్ని'.

ఈ రకంగా చూసినప్పుడు కేంద్ర ప్రభుత్వం నియమించిన 11 మంది పెద్ద మనుషుల కమిటీ దేనిని సమీక్షిస్తుందన్న ప్రశ్న వస్తుంది. ఈ 11 మందీ పాలనా వ్యవస్థ, శాసనవ్యవస్థ, న్యాయవ్యవస్థ, రాజకీయాలు దేనిలో ఒకదానిలో ప్రముఖపాత్ర నిర్వహించిన వారే. ఇప్పుడు సమీక్షించబోతున్న 'రాజ్యాంగాన్ని' రూపొందించిన యాభై ఏళ్ల చరిత్రలో భాగస్వాములే. ఇప్పుడు వాళ్లు జరపవలసింది రాజ్యాంగ సమీక్షా లేక ఆత్మసమీక్షా?

వెంకటాచలయ్య, జీవన్‌రెడ్డి, సర్కారియా, పున్నయ్య గార్లు న్యాయమూర్తులుగా పనిచేశారు. న్యాయవ్యవస్థ ప్రజలకందించిన రాజ్యాంగం రూపకల్పనలో వారు భాగస్వాములు. అణగారిన ప్రజల మేలు కోసం (రాజ్యాంగం కల్పించిన అవకాశాన్ని వాడుకొని) ప్రభుత్వం చట్టాలు చేస్తే, వాటిని బలవంతులు సవాలు చేస్తూ కోర్టుకెక్కడం, కోర్టులు చివరికి వాటిని కొట్టేసినా కొట్టేయకున్నా ఏళ్ల తరబడి 'స్టే' ఇవ్వడం మన న్యాయవ్యవస్థ వ్యవహార శైలికి సంబంధించిన ఒక వికారమైన వాస్తవం. అటువంటి కేసులకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఇచ్చి, త్వరగా విని నిర్ణయం చేయాలన్న నియమాన్ని సహితం మన న్యాయవ్యవస్థ ఈ యాభై ఏళ్లలో రూపొందించుకోలేకపోయింది. అందులో భాగమైన ఈ నలుగురూ ఇవ్వాళ రాజ్యాంగాన్ని సమీక్షిస్తారా? లేక తమను తాము సమీక్షించుకుంటారా? రాజ్యాంగ సమీక్షా కమిటీలోని తక్కిన ఎనిమిది మంది కూడా పాలనా వ్యవస్థలోనో శాసన వ్యవస్థలోనో ప్రముఖస్థానం నిర్వహించినవారే. కాబట్టి వాళ్ల గురించి కూడా ఇటువంటి ప్రశ్నలే వేయవచ్చు. రాజ్యాంగం ప్రజలకు హామీ ఇచ్చిన హక్కుల పట్ల మనదేశ పాలనా వ్యవస్థ ఏ రోజైనా ఏమాత్రం గౌరవం ప్రదర్శించింది? రాజ్యాంగ ఆదేశిక సూత్రాల వెలుగులో విధాన నిర్ణయాలు చేయడానికి శాసనసభలు ఏ రోజైనా ఏ మాత్రం ప్రయత్నం చేశాయి? ఈ వ్యవస్థలలో ప్రముఖపాత్ర నిర్వహించిన పెద్ద మనుషులు ఇప్పుడు రాజ్యాంగాన్ని సమీక్షిస్తారా, లేక తమను తాము సమీక్షించుకుంటారా?

> **WE, THE PEOPLE OF INDIA,** having solemnly resolved to constitute India into a **SOVEREIGN SOCIALIST SECULAR DEMOCRATIC REPUBLIC** and to secure to all its citizens:
>
> **JUSTICE,** social, economic and political;
>
> **LIBERTY** of thought, expression, belief, faith and worship;
>
> **EQUALITY** of status and of opportunity;
>
> and to promote among them all
>
> **FRATERNITY** assuring the dignity of the individual and the unity and integrity of the Nation;
>
> **IN OUR CONSTITUENT ASSEMBLY** this twenty-sixth day of November, 1949, do **HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.**

కె.ఆర్.నారాయణన్ అడిగిన ప్రశ్నను ఈ రకంగా వ్యాఖ్యానించుకోవచ్చు.

దళితవాదుల ప్రశ్న కూడా లోతయినదే. మన హిందుత్వవాద పాలకులు రాజ్యాంగ సమీక్ష కోసం పదకొండు మంది పెద్ద మనుషుల కమిటీ వేసి ఊరుకోలేదు. వారి అనుచరగణాలు వీధులలో 'రాజ్యాంగ సమీక్ష' జరుపుతున్నారు. ఉదాహరణకు భావప్రకటనా స్వేచ్ఛకు ఇప్పుడు రాజ్యాంగంలో ఉన్న పరిమితులు సరిపోతాయా లేదా అన్న 'చర్చ'ను కర్రలతో, రాళ్లతో కాశీనగర వీధులలో ఈ మధ్య జరిపారు. రాజ్యాంగంలో ఉన్న పరిమితులన్నీ సహేతుకమైనవని అనలేముగానీ, కాశీ బ్రాహ్మణ్లకు మనస్తాపం కలిగించడానికి వీలు లేదన్న పరిమితి ఇప్పటిదాకా రాజ్యాంగంలో లేదు. దానిని కొత్తగా ఈ మధ్యనే కల్పించారు. రేపు దానిని రాజ్యాంగంలో - ఇంత పచ్చిగా కాకున్నా - రాయరన్న నమ్మకమేముంది? ఈ అనుమానం సహేతుకమైనదే.

దీనిని మరికొంచెం వెనక్కి తీసుకుపోయి తర్కించవచ్చు. మన రాజ్యాంగంలోని అప్రజాస్వామిక లక్షణాలు బ్రిటిష్ వలస పాలనా వ్యవస్థ నుండి రాగా, ప్రజాస్వామిక లక్షణాలు జాతీయ ఉద్యమం నుండి, దానితోబాటు (ఒక్కొక్కసారి దానిలో భాగంగా, ఒక్కొక్కసారి స్వతంత్రంగా) సాగిన సాంఘిక ఆర్థిక సంస్కరణోద్యమాల నుండి, ప్రజాపోరాటాల నుండి వచ్చాయి. వీటిలో ఏ ఒక్క దానితోనూ సంఘపరివార్‌కు ఎటువంటి సంబంధం లేదు. వారు జాతీయోద్యమ రాజకీయ పోరాటంలోనూ భాగం కాదు, సాంఘిక ఆర్థిక సంస్కరణలలోనూ పోరాటాలలోనూ భాగం కాదు. కాకపోగా వాటికి వ్యతిరేకులు. నిజానికి గాంధీ హత్యను మినహాయిస్తే వారికి జాతీయోద్యమంలో ఏ పాత్రా లేదు!

వారు రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామిక పార్శ్వానికి తొలి నుండి శత్రువులే. ఇవ్వాళ అధికారంలోకి వచ్చారు కాబట్టి దానిని సమీక్షిద్దామంటున్నారు గానీ వాళ్లకు రాజ్యాంగంలోని హక్కుల పార్శ్వం పట్ల ఏ రకమైన ఆపేక్షా ఏ రోజూ లేదు.

అందువల్లనే వాళ్లు రాజ్యాంగాన్ని సమీక్షిద్దాం అనగానే అందరూ కీడు శంకిస్తున్నారు. రాజ్యాంగ సమీక్ష అక్కరలేదంటున్నారు. సంఘ పరివార్ దృక్కోణం

నుంచి రాజ్యాంగాన్ని తిరగరాస్తే అదెంత దుర్భరంగా ఉంటుందో ఊహించుకోగలం కాబట్టి ఈ ఆందోళన సహేతుకమైనదే.

కానీ ప్రజాస్వామికవాదులు చెప్పేది ఇంతే అయితే రాజ్యాంగాన్ని ఒక అద్భుతమైన పత్రంగా, ప్రజలకు కావలసిన బలమంతా ఇచ్చే పత్రంగా చూపించడం అవుతుంది. ఇప్పటి పరిస్థితులలో రాజ్యాంగం నుండి కొత్తగా కోరుకునేదేమీ లేదని ప్రకటించడమవుతుంది. అది వాస్తవికమైన వైఖరి కాదు.

రాజ్యాంగాన్ని సమీక్షించవచ్చునా లేదా అన్న వివాదంలో చిక్కుకోకుండా, సమీక్ష ఏ కోణం నుండి చేయాలని ప్రశ్నించుకోవడం అవసరం. రాజ్యాంగాన్ని మాత్రమే కాదు, రాజ్యాంగం అమలును కూడా సమీక్షించుకోవాలని చెప్పడం అవసరం.

సమీక్షకోణం గురించి ప్రశ్న వేసుకోగానే బిజెపి పాలకుల ప్రతిపాదనలోని అసంబద్ధత స్పష్టమవుతుంది. 'అభివృద్ధి'కీ 'స్థిరత్వాని'కీ రాజ్యాంగం ఉపయోగపడిందా లేదా అని చర్చించాలని వారి ప్రతిపాదన అంటుంది. ఆ లక్ష్యాలు రాజ్యాంగంలో రాసుకొని ఉంటే ఆ ప్రాతిపదికన సమీక్షించడంలో అర్థం ఉంటుంది. కానీ భారత రాజ్యాంగం ప్రకటించుకున్న లక్ష్యం 'అభివృద్ధి' కాదు, 'స్థిరత్వం' కాదు. ఇప్పుడు ఎక్కువగా అందరూ మాట్లాడుతున్న 'స్థిరత్వం' అనే మాట రాజ్యాంగంలో ఎక్కడా లేదు. 'అభివృద్ధి' అనే మాట కూడా రాజ్యాంగ లక్ష్యాలలో లేదు. రాజ్యాంగ లక్ష్యాలయిన సామాజిక ఆర్థిక న్యాయానికి 'అభివృద్ధి' అడ్డం రాకూడదన్నహెచ్చరిక మాత్రమే (ఆర్టికల్ 39లో) ఉంది.

రాజ్యంగ లక్ష్యాలలో భాగం కాని వాటి సాధనకు రాజ్యాంగం పనికొచ్చిందా అని సమీక్షించడంలో అర్థం లేదు. ఈ మాట రాజ్యాంగ సమీక్షా సంఘంలోని 11మంది పెద్ద మనుషులలో ఏ ఒక్కరూ ప్రభుత్వంతో అనలేకపోయారంటే - నువ్వు చేయమంటున్న సమీక్షకూ రాజ్యాంగ లక్ష్యాలకూ ఏమీ సంబంధంలేదని వాజ్‌పేయితో అనలేకపోయారంటే - 'అభివృద్ధి' అనే ఆకర్షణ విజ్ఞులనుకునేవారిపైన సహితం ఎంత బలంగా పనిచేస్తున్నదో అర్థం అవుతుంది.

సమీక్ష అంటూ జరిపితే రాజ్యాంగం ప్రకటించుకున్న లక్ష్యాలయిన సామాజిక ఆర్థిక రాజకీయన్యాయం అనే ఆదర్శాన్ని ప్రమాణంగా తీసుకొని జరగాలి. అప్పుడు ఆ లక్ష్యానికి కావలసిన అవకాశాలూ హక్కులూ రాజ్యాంగం ప్రజలకు సంపూర్ణంగా ఇచ్చిందా అని చర్చించుకోవచ్చు. రాజ్యాంగంలో ఉన్న బ్రిటిష్ వలసపాలకుల వారసత్వమైన పాలనా వ్యవస్థకూ, రాజ్యాంగం భరోసా ఇచ్చిన ఆస్తిహక్కు, వ్యాపారస్వేచ్ఛలకూ, అదే రాజ్యాంగం ప్రకటించుకున్న సమతాన్యాయాల లక్ష్యాలకూ మధ్యనున్న వైరుధ్యాన్ని సమీక్షించుకోవచ్చు. అయితే ముఖ్యంగా, రాజ్యాంగం అవకాశం కల్పించినమేరకు కూడా సామాజిక ఆర్థిక రాజకీయన్యాయాన్ని నిలబెట్టడానికి కృషిచేయని పాలనా వ్యవస్థ తీరునూ శాసన వ్యవస్థ తీరునూ రాజకీయాల తీరునూ సమీక్షించుకోవచ్చు. ఈ యాభై ఏళ్లలో ముందుకొచ్చిన ఆదర్శాలలో ఎన్నిటిని రాజ్యాంగంలో చేర్చారని రాజకీయవ్యవస్థను ప్రశ్నించవచ్చు. రాజ్యాంగ చట్టాన్ని రాజ్యాంగ ఆదర్శాల వెలుగులో వ్యాఖ్యానించి ఆ ఆదర్శాలకు వాస్తవ రూపం ఇవ్వడానికి తోడ్పడే ప్రయత్నం అరకొరగా తప్ప చేయని న్యాయవ్యవస్థను సమీక్షించుకోవచ్చు.

ఇదంతా కేవలం కాలక్షేపం కోసం కాదు. గ్లోబలైజేషన్, హిందుత్వవాద ఫాసిజం అనే జంట ప్రమాదాలు ప్రజాస్వామ్యాన్నీ ప్రజల హక్కులనూ బలితీసుకుంటున్న ఈ తరుణంలో ప్రజలు ఏమేరకు రాజ్యాంగం నుండి శక్తి పొందగలిగితే ఆ మేరకు పొందాలి. ఈ కర్తవ్యానికి కావలసిన సంపూర్ణమైన శక్తి రాజ్యాంగం ఇస్తుందంటే అతిశయోక్తి అవుతుందిగానీ అందుకు తోడ్పడేదేమీ రాజ్యాంగంలో అసలే లేదంటే అది అతిశయోక్తి కాదు, జాతీయ ఉద్యమ వారసత్వంగా మన రాజ్యాంగంలోకి వచ్చిన ప్రజాస్వామిక విలువలను తిరస్కరించడం కూడా అవుతుంది. గ్లోబలైజేషన్ నుండి, సంఘపరివార్ ఫాసిజం నుండి ప్రజల హక్కులనూ జీవితాన్నీ రక్షించుకోవడానికి కావలసిన బలమంతా రాజ్యాంగం నుండే రాదు, రానవసరం లేదు. కానీ రాజ్యాంగ హక్కులనూ సమానతా ఆదర్శాలనూ ఏ మేరకు బలపరచుకొగలిగితే ఆ మేరకు పై కర్తవ్యం సులభతరం అవుతుంది.

ఇందుకు కావలసింది రాజ్యాంగంలో మొదటి నుండీ ఉన్న అంతర్గత వైరుధ్యాల పైన చర్చ, రాజ్యాంగ ఆదర్శాలను అవకాశమున్న మేరకు కూడా అమలు చేయడానికి పెద్దగా ఉత్సాహం చూపని రాజ్యయంత్రాంగం పైన, రాజకీయాలపైన, న్యాయవ్యవస్థపైన చర్చ. రాజ్యాంగ ఆదర్శాలతో ఏమీ సంబంధం లేని సామాజిక రాజకీయ లక్ష్యాలు గల సంఘ్ పరివార్ చేపడుతున్న సమీక్షకు ఇదే సరయిన జవాబు కాగలదు.

భారతదేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా కండబలం గల పెత్తందారీ రాజ్యంగా మార్చాలన్నది సంఘపరివార్ లక్ష్యం. దేశ సామాజిక రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి ఆదర్శాలుండడం దీనికి ఆటంకమని వారి అభిప్రాయం. అవి 'దేశాన్ని' బలహీనపరుస్తాయి. అందువల్ల ఈ లక్ష్యాలు గల రాజ్యాంగం వారికి అవరోధంగా కనిపిస్తున్నది. అందుకోసమే ఈ సమీక్ష. ఈ సమీక్ష స్వభావాన్ని ఎండగడుతూ, ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం అనే లక్ష్యాల సాధనకు రాజ్యాంగంలో ఇప్పటికే ఉన్న అవరోధాల గురించి, రాజ్యాంగం అమలులో జరిగిన వైఫల్యాల గురించి ప్రజల వైపునుండి చర్చ జరపడం అవసరం. గ్లోబలైజేషన్, సంఘపరివార్ ఫాసిజం అనే రెండు ప్రమాదాలు ఈ లక్ష్యాలను మరింత దూరం చేస్తున్న తరుణంలో ఈ చర్చ మరీ అవసరం.

ఈ కోణం నుండి రాజ్యాంగాన్నీ రాజ్యాంగ యంత్రాన్నీ - న్యాయ, శాసన, పరిపాలనా వ్యవస్థలనూ, దేశ రాజకీయాలనూ - సమీక్షిద్దాం రమ్మని ఆహ్వానిస్తూ ...

## బహిరంగ సభ

**మార్చ్ 18 శనివారం సా. 5 గం.లకు లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్, రామ్‌నగర్, విశాఖపట్నం**

అధ్యక్షత : వి.ఎస్. క్రిష్ణ (మానవ హక్కుల వేదిక)

వక్తలు : డా॥ పి.డి. సత్యపాల్ (ఆంధ్రాయూనివర్శిటీ)

కె. బాలగోపాల్ (మానవ హక్కుల వేదిక)

12-3-2000

**మానవహక్కుల వేదిక (HRF)**

విశాఖపట్నం